

'పరిహారమెందుకు ఇవ్వరు?'

సాలూరు రూరల్, ఫిబ్రవరి 23: గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులు మరణిస్తే.. వారి కుటుంబాలకు పరిహారమెందుకు ఇవ్వడం లేదని ఉత్త రాంధ్ర గిరిజన సంక్షేమ సంఘం నేతలు సాయిబాబు, రంజిత్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గతంలో కురుపాం బీసీ గురుకుల పాఠశాల లో విద్యార్థి పాముకాటుతో మరణిస్తే.. బాధిత కుటుంబానికి అప్పటి ఐటీడీఏ పీవో రూ.5 లక్షలు అందించారని పేర్కొన్నారు. అయితే తాజా సంఘటనలపై స్పందించకపోవడం దారుణమన్నారు.ఈ ఘటనల్లో వార్డెన్లు సైతం బాధ్యులేనన్నారు. పీటీజీ పాఠశాలకు మహిళా ప్రిన్సిపాల్‌ను నియమించాలని డిమాండ్ చేశారు.



కురుపాంలో పూర్తికాని సచివాలయం-1 భవన నిర్మాణం

- ముందుకు సాగని అభివృద్ధి పనులు
- రూ.25 కోట్లకు పైగా బకాయిలు
- చెల్లింపులపై దృష్టి సారించని సర్కారు
- ఎన్నికలకు సమీపిస్తున్న సమయం
- కొద్దిరోజుల్లో ముగియనున్న ఆర్థిక సంవత్సరం
- నిధులు వస్తాయో.. రావోనన్న ఆందోళనలో కాంట్రాక్టర్లు

బిల్లుల్లేవ్.. పనుల్లేవ్!

పార్వతీపురం, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): 'ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నాం.. అభివృద్ధి పనులకు పెద్దపీట వేస్తున్నాం.. ఇందుకోసం భారీగా నిధులు కేటాయిస్తున్నాం' అని ఊదరగొట్టే వైసీపీ సర్కారు.. ఆచరణలో మాత్రం భిన్నంగా వ్యవహరిస్తోంది. సకాలంలో బిల్లులు చెల్లించడం లేదు. దీంతో జిల్లాలో అభివృద్ధి పనులు కొలిక్కి రావడం లేదు. నిర్మాణాలు తుది దశకు చేరుకోవడం లేదు. కొన్నిచోట్ల ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. మరోవైపు ఎన్నికలకు సమయం సమీపిస్తోంది.



గరుగుబిల్లిలో సచివాలయ భవన నిర్మాణం ఇలా..

మరికొద్ది రోజుల్లోనే షెడ్యూల్ కూడా విడుదల కానుంది. ఈ ఆర్థిక సంవత్సరం కూడా కొద్ది రోజుల్లో ముగియనుంది. దీంతో అప్పులు చేసి మరీ అభివృద్ధి పనులు చేపట్టిన వారు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. బిల్లుల కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. తక్షణమే చెల్లింపులు చేసి తమను ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

వైసీపీ ప్రభుత్వం పాలనా పగ్గాలు చేపట్టిన తర్వాత సచివాలయాలు, ఆర్‌బీకేలు తదితర భవన నిర్మాణాలకు అధిక ప్రాధాన్యం ఇచ్చింది. ఈ మేరకు కాంట్రాక్టర్లు చురగ్గా పనులు చేపట్టారు. ఇందులో కొంతమంది వైసీపీ ప్రజాప్రతినిధులు కూడా ఉన్నారు. తమ ప్రభుత్వమే కదా అని అప్పులు చేసి మరీ నిర్మాణాలు చేపట్టారు. అయితే నిర్మాణాలకు తగ్గట్టుగా సర్కారు బిల్లులు చెల్లించడం లేదు. చెల్లింపుల్లో జాప్యం చేస్తుండడంతో కాంట్రాక్టర్లు తలలు పట్టుకుంటున్నారు. జిల్లాలో గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు తదితర ప్రాధాన్య భవన నిర్మాణాలతో పాటు సీసీ రహదారులు, కాలువలు వంటి నాన్ ప్రాధాన్య పనులు పూర్తి చేసిన వారు తమ బిల్లుల చెల్లింపుల కోసం ఇంజనీరింగ్ కార్యాల యాల చుట్టూ ప్రదక్షిణ చేయాల్సి వస్తోంది. అయినా ఫలితం దక్కడం లేదు. మరోవైపు ఎన్నికల షెడ్యూల్ వారిని కలవరపరుస్తోంది. ఇదిలా ఉండగా బిల్లులు మంజూరు కాకపోవడంతో ఇక జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో సచివాలయాలు, ఇతరత్రా అభివృద్ధి పనులు ముందుకు సాగడం లేదు. ఇవి ఎన్నికల లోపు అందుబాటులోకి వస్తాయా? అన్నది ప్రశ్నార్థకంగా మారింది.

రూ. 25 కోట్లు పైనే...

జిల్లాలో ఇప్పటివరకు పూర్తి చేసిన ప్రాధాన్య నాన్ ప్రాధాన్య పనుల ప్రాప్తికి సుమారు రూ.25 కోట్లు పైనే ప్రభుత్వం కాంట్రాక్టర్లకు చెల్లించాల్సి ఉంది. మరికొద్ది రోజుల్లో ఆర్థిక సంవత్సరం కూడా ముగియనుంది. ఈ లోగా బిల్లుల చెల్లింపులు జరగకపోతే.. నూతన ఆర్థిక సంవత్సరంలో ఎప్పటికి చెల్లిస్తారో తెలియని పరిస్థితి. దీంతో తమ బిల్లులు చెల్లించాలని కాంట్రాక్టర్లు ఇంజనీరింగ్ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. అయితే ఇప్పటివరకు దీనిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోవడంతో వారు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

ఎన్నికల వేళ.. పనులు జరిగేనా?

మరో రెండు నెలల్లోనే ఎన్నికలు జరగనున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో బిల్లులు చెల్లింపులు జరగకపోవడంతో కొంతమంది కాంట్రాక్టర్లు చేతులెత్తేశారు. దీంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. మొండిగోడలు, పిచ్చి మొక్కల మధ్య ప్రభుత్వ ప్రాధాన్య భవనాలు దర్శమిస్తున్నాయి. కాగా జిల్లా అధికారులు కూడా ఎన్నికల ఏర్పాట్లపైనే దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో జిల్లాలో అభివృద్ధి పనులు ముందుకెళ్లే పరిస్థితి కనిపించడం లేదు.

చెల్లింపులవుతున్నాయి..

జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి పనులకు సంబంధించి చెల్లింపులవుతున్నాయి. సుమారు రూ.నాలుగున్నర కోట్లు వరకు చెల్లించాం. ఇంకా రూ.25 కోట్ల వరకు బకాయి ఉన్న బిల్లులను త్వరలోనే సర్కారు చెల్లిస్తుంది.

-రామచంద్రరావు, పీడీ, డ్వామా, పార్వతీపురం మన్యం

పెండింగ్ దరఖాస్తులపై దృష్టి

● కలెక్టర్ నిశాంత్‌కుమార్

పార్వతీపురం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులకు సంబంధించిన పెండింగ్ దరఖాస్తులపై దృష్టి సారించి.. వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ ఆదేశించారు. ఓట్ల లెక్కింపు కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌ల ఏర్పాటు తదితర అంశాలపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా శుక్రవారం వీడియోకాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లాలో ఎన్నికల ఏర్పాట్లు, ఓటర్ల జాబితాలపై పత్రికల్లో వచ్చిన వార్తలపై తీసుకున్న చర్యలను వివరించారు. అనంతరం ఆయన క్షేత్రస్థాయి సిబ్బందితో సమావేశమయ్యారు. పోలిగ్ కేంద్రాల్లో వసతుల కల్పన, ఎన్నికల అధికారులు, సిబ్బంది నియామకం, ఓటర్లను ప్రభావితం చేసే వస్తువుల అక్రమ రవాణా నియంత్రణ, తదితర అంశాలపై చర్చించారు. ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులకు సంబంధించిన దరఖాస్తులను రెండు రోజుల్లో పరిష్కరించాలని సూచించారు. సమావేశంలో ఇన్‌చార్జి జేసీ, ఐటీడీఏ పీవో విష్ణుచరణ్, ఇన్‌చార్జి రెవెన్యూ అధికారి జి.కేశవ నాయుడు, ఆర్డీవోలు హేమలత, రమణ పాల్గొన్నారు.



సమావేశంలో కలెక్టర్, ఐటీడీఏ పీవో తదితరులు

ఎన్నికల కౌంటింగ్‌కు పరిశీలన

గరుగుబిల్లి, ఫిబ్రవరి 23 : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కౌంటింగ్ నిర్వహణకు గాను ఉల్లిభద్రలో ఉద్యాన కళాశాలను శుక్రవారం అధికారులు పరిశీలించారు. బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సామగ్రిని భద్రపర్చేందుకు, వాహనాల పార్కింగ్, స్ట్రాంగ్ రూము, రిసెప్షన్ కేంద్రాలకు కళాశాల ఉపయోగకరంగా ఉంటుందని గుర్తించారు. గరుగుబిల్లి, పార్వతీపురం ఇన్‌చార్జి తహసీల్దార్లు సత్యలక్ష్మికుమార్, రమణ, సర్వేయర్లు బి.శ్రీనివాసరావు, సన్యాసి నాయుడు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఎం.కృష్ణ, ఆర్‌అండ్‌బీ శాఖల అధికారులు కళాశాల గదులను పరిశీలించారు. ఎన్నికలకు సంబంధించి రెండు భవనాలు అవసరమని ఆర్డీవోలు హేమలత, రమణ, కళాశాల డీన్ ప్రసన్న కుమార్‌కు వారు సమాచారం అందించారు.



ఉద్యాన కళాశాలలో రూములను పరిశీలిస్తున్న అధికారులు

ఎఫ్‌ఏ-4 పరీక్షలు ప్రారంభం

గరుగుబిల్లి/సాలూరు రూరల్, ఫిబ్రవరి 23 : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం ఎఫ్‌ఏ-4 పరీక్షలు ప్రారంభమయ్యాయి. అయితే ప్రశ్న పత్రాలను పాఠశాలలకు సరఫరా చేయడం లేదు. పరీక్షకు గంట ముందు వాట్సాప్‌లో ప్రశ్న పత్రాలను పోస్ట్ చేస్తున్నారు. వాటిని ఉపాధ్యాయులు బోర్డుపై రాసి పరీక్షలు నిర్వహిస్తున్నారు. దీనివల్ల సమయం వృథా అవుతుందని ఉపాధ్యాయులు వాపోతున్నారు. కాగా ఈ విధానానికి స్వస్తి పలికి ప్రశ్నపత్రాలను పంపిణీ చేయాలని ఏపీటీఎఫ్-257 జిల్లా కార్యదర్శి నల్లా బాలకృష్ణ తదితరులు డిమాండ్ చేస్తున్నారు. కాగా 10వ తరగతికి సంబంధించి శుక్రవారం తెలుగు పరీక్ష నిర్వహించారు. 24న హిందీ, 26న ఇంగ్లిషు, 27న లెక్కలు, 28న ఫిజికల్ సైన్స్, 29న బైలాజికల్ సైన్స్, మార్చి 1న సోషల్, 2న కంప్యూటర్ కోర్సు, 4న ఓఎస్‌ఎస్‌సీ పరీక్షలు జరగనున్నాయి. 1 నుంచి 5 తరగతుల వారికి ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు తెలుగు, లెక్కలు పరీక్షలు జరిగాయి. 24న ఎన్విరాన్‌మెంట్ సైన్స్, ఇంగ్లిషు, 26న 3 నుంచి 5 తరగతుల వారికి ఓఎస్‌ఎస్‌సీ పరీక్షలు నిర్వహించనున్నారు. 6 నుంచి 8 తరగుతులకు తెలుగు, గణితం పరీక్షలు నిర్వహించారు. 24న హిందీ, సైన్స్, 26న సోషల్, 27న ఇంగ్లిషు, 28న ఓఎస్‌ఎస్‌సీ పరీక్షలు జరగనున్నాయి. వచ్చేనెల నాలుగో తేదీ వరకు టెన్త్ విద్యార్థులకు ఈ పరీక్షలు జరగ్గా, వారికి మాత్రం ప్రశ్నపత్రాలను అందిస్తున్నారు.



కొత్తూరు ప్రాథమిక పాఠశాలలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

గజరాజుల బీభత్సం

● పల్లెల్లో పంటలు ధ్వంసం



పెదమేరంగి గ్రామ సమీపంలో ఉన్న ఏనుగుల గుంపు

జియ్యమ్మవలస, ఫిబ్రవరి 23 : మండలంలో పెదమేరంగి పంచాయతీ రామినాయుడువలసలో శుక్రవారం మధ్యాహ్నం ఏనుగులు బీభత్సం సృష్టించాయి. సుమారు రెండెకరాల్లో మొక్కజొన్న, ఎకరా అరటి పంటలను ధ్వంసం చేశాయి. మోటారు పైపులను నాశనం చేశాయి. అనంతరం అవి పెదమేరంగి కూడలి వద్ద నుంచి గవరమ్మపేటకు చేరుకున్నాయి. ఆ గ్రామ సమీపంలో ప్రధాన రహదారి పక్కనే ఉన్న పెట్రోల్ బంకు వద్ద తిష్ట వేశాయి. దీంతో ఏ క్షణంలో ఏం జరుగుతుందోనని వాహన దారులు, పాదచారులతో పాటు గవరమ్మ పేట, ఎరుకుల పేట గ్రామస్థులు భయభ్రాంతులకు గురయ్యారు. కొద్దిసేపటి తర్వాత గవరమ్మపేట గ్రామం పక్కనే ఉన్న పంట పొలాల్లోకి ఏనుగులు వెళ్లాయి. సుమారు రెండెకరాల్లో అరటి, మొక్కజొన్న పంటలను నాశనం చేశాయి. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. తక్షణమే ఈ ప్రాంతం నుంచి ఏనుగులను తరలించి.. తమకు నష్టపరిహారం ఇవ్వాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

త్రుటిలో తప్పిన ప్రాణాపాయం..

ఆయా గ్రామాల్లో ఫారెస్టు ట్రాకర్స్ దివిటీలతో ఏనుగుల వెంట వెళ్తుండగా.. వారిపై దాడికి ఓ ఏనుగు రావడంతో అక్కడి నుంచి వారు పక్కకు తప్పుకున్నారు. దీంతో వారికి త్రుటిలో ప్రాణాపాయం తప్పింది. ఎవరికీ ఏమీ కాకపోవడంతో అటవీశాఖ అధికారులు, స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. కాగా ప్రస్తుతం పెదమేరంగిలో గజరాజులు హల్‌చల్ చేస్తున్నాయి. దీంతో ఆ ప్రాంతవాసులు భయాందోళన చెందుతున్నారు.

గిరిజన గృహాలకు ఉచిత విద్యుత్

● ఏపీఈపీడీసీఎల్ పీడీ సూర్యప్రతాప్

గుమ్మలక్ష్మీపురం: జిల్లాలో గిరిజన గృహాలకు ఉచితంగా విద్యుత్ సౌకర్యం కల్పించనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ప్రాజెక్టు డైరెక్టర్ ఏవీవీ సూర్యప్రతాప్ తెలిపారు. గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాల పరిధిలో ఉన్న దుడ్డుకళ్లు పంచాయతీలో కంబగూడ, లోవలక్ష్మీపురం, వినకబడి పంచాయతీ కుస గ్రామాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. విద్యుత్ సరఫరా కల్పిస్తున్న గృహాలను పరిశీలించి పనులను పూర్తి చేయాలని సిబ్బందికి ఆదేశించారు. ఉచిత విద్యుత్ సరఫరా పథకంలో భాగంగా మీటర్లు, సర్వీసు వైరు, ఎల్‌ఈడీ బల్బు అందించనున్నట్లు చెప్పారు. ఆయన వెంట ట్రాన్స్‌కో అధికారులు లక్ష్మణరావు, కిషోర్, రాజేంద్రప్రసాద్, త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో ప్రవేశాలకు
గడువు పెంపు

సాలూరు రూరల్,ఫిబ్రవరి 23: ఉమ్మడి జిల్లాలోని బీఆర్ అంబేడ్కర్ గురుకులాల్లో ప్రవేశాలకు గడువు పెంచారు. 2024-2025 విద్యాసంవత్సరానికి ఐదో తరగతి, ఇంటర్మీడియట్ ప్రథమ ఏడాదిలో ప్రవేశాలకు గాను దరఖాస్తు గడువును ఈ నెల 28 వరకు పెంచినట్టు జిల్లా కో ఆర్డినేటర్ టి.పద్మజ చెప్పారు. శుక్రవారం ఆమె విలేఖర్లతో మాట్లాడుతూ..'విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో మొత్తంగా 13 బీఆర్ అంబేడ్కర్ గురుకులాలు న్నాయి.. వాటిలో ఐదో తరగతిలో బాలికలకు 640 సీట్లు, బాలురకు 400 సీట్లు ఉన్నాయి. ఇంటర్ ప్రథమ ఏడాదిలో బాలురకు ఎంపీసీలో 160 సీట్లు, బైపీసీలో 160 సీట్లు, సీఈసీ, ఎంఈసీలకు చెరో 40 సీట్లు ఉన్నాయి. బాలికలకు ఎంపీసీ, బైపీసీలకు 200 చొప్పున సీట్లు, ఉన్నాయి. సీఈసీకి 160 సీట్లు, ఎంఈసీ, హెచ్‌ఈసీలకు గ్రూప్‌నకు 40 చొప్పున సీట్లు ఉన్నాయి. ఐదో తరగతి ప్రవేశం కోరే విద్యార్థులకు వచ్చే నెల 10న ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తాం. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఇంటర్ మొదటి ఏడాదిలో ప్రవేశం కోరే విద్యార్థులకు పరీక్ష నిర్వహిస్తాం. ఇం దుకు సంబంధించి ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రవేశాల్లో ఎస్సీలకు 75 శాతం, బీసీ-సీ (క్రిస్టియన్లుగా మారిన వారికి) 12 శాతం, ఎస్టీలకు 6 శాతం, బీసీలకు 5 శాతం, ఇతరులకు 2 శాతం రిజర్వేషన్లు వర్తింపజేస్తాం' అని తెలిపారు.

ఏపీజీవీబీ ఉద్యోగుల నిరసన

పార్వతీపురం టౌన్, ఫిబ్రవరి 23: తమ న్యాయమైన డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం పరిష్కరించే వరకు పోరాడుతామని ఏపీజీవీబీ ఉద్యోగులు స్పష్టం చేశారు. అఖిల భారత ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల ఉద్యోగ సంఘాల పిలుపుమేరకు శుక్రవారం పట్టణంలో గ్రామీణ వికాస్ బ్యాంకు ఉద్యోగులు నిరసన కార్యక్రమం చేపట్టారు. స్థానిక బైపాస్ రోడ్డులో రీజనల్ కార్యాలయం నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీజీవీబీ ఉద్యోగ సంఘం జనరల్, రీజనల్ కార్యదర్శులు జి.అప్పలనాయుడు, బి.కిరణ్‌కుమార్ మాట్లాడుతూ.. రోజువారీ.. దినసరి ఉద్యోగుల ఆర్థిక భద్రతను కాపాడాలన్నారు. సర్వీసు రూల్స్, లీవ్ రూల్స్, పదన్నోతుల పాలసీలను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. పెన్షన్ విధానాన్ని స్పాన్సర్ బ్యాంకులతో సమానంగా గ్రామీణ బ్యాంకులకు వర్తింపజేయాలని, కారుణ్య నియామకాలను స్పాన్సర్ బ్యాంకులతో సమానంగా అమలు చేయాలన్నారు. అనతరం తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ.. ఏపీజీవీబీ ప్రాంతీయ కార్యాలయాధికారి బి.రాఘవేంద్రకు వినతపత్రాన్ని అందజేశారు.



జిల్లా కేంద్రంలో ర్యాలీ చేస్తున్న ఏపీజీవీబీ ఉద్యోగులు

గ్రూప్-2 పరీక్ష రేపు

● ఏర్పాట్లలో అధికారులు నిమగ్నం

విజయనగరం కలెక్టరేట్, ఫిబ్రవరి 23: ఏపీపీఎస్‌సీ ఆధ్వర్యంలో గ్రూపు-2 పరీక్ష ఆదివారం జరగనుంది. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ పరీక్ష జరుగుతుంది. కాగా ఉదయం 9.30 గంటల నుంచి 10.15 వరకూ కేంద్రం లోపలికి అనుమతిస్తారు. అభ్యర్థులు హాల్ టిక్కెట్‌తో పాటు ఏదైనా ఫొటో గుర్తింపు కార్డును తప్పసరిగా తీసుకు వెళ్లాలి. కాగా పరీక్ష ఏర్పాట్లపై డీఆర్‌వో అనిత శుక్రవారం విజయనగరం కలెక్టరేట్ ఆడిటోరియంలో అధికారులతో సమీక్షించారు. విజయనగరం జిల్లాలోని 80 కేంద్రాల్లో నిర్వహించే ఈ పరీక్షకు 26,452 మంది అభ్యర్థులు హాజరు కానున్నారు. 24 రూట్లుగా విభజించి 24 మంది జిల్లా అధికారులను రూట్ అధికారులుగా నియమించారు. పరీక్ష పత్రాలు తీసుకున్న దగ్గర నుంచి పరీక్ష అనంతరం ఆన్సర్ పేపర్లను సేకరించాల్సిన బాధ్యత చీఫ్ సూపరింటెండెంట్లు తీసుకోవాలని డీఆర్వో సూచించారు. పేపర్లు తీసుకునేటప్పుడు వెన్యూ కోడ్ సరి చూసుకోవాలన్నారు. లైజినింగ్ అధికారులు పరీక్షా కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు, సిటింగ్ ఏర్పాట్లు, తాగునీటి సదుపాయం, మహిళలకు, పురుషులకు వేర్వేరుగా మరుగుదొడ్లు ఉండేలా ఏర్పాట్లు చేయాలన్నారు. గర్భిణులకు గ్రౌండ్‌ఫ్లోర్‌లోనే ఏర్పాట్లు చేయాలని సూచించారు. దివ్యాంగత్వం 40 శాతం పైబడిన వారికి స్క్రైబ్‌ను స్వయంగా తీసుకు రావచ్చని లేదా సెంటరులోనే ఏర్పాటు చేస్తామని డీఆర్వో తెలిపారు.

నల్ల బ్యాడ్జీలు ధరించి.. నినదించి..

● పీఆర్ ఇంజనీరింగ్ అధికారుల ఆందోళన

పార్వతీపురం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖాధికారుల సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘం నాయకులు లక్ష్మణరావు, చంద్రమౌళి, రత్నకుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి.. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఖాళీగా ఉన్న ఇంజనీరింగ్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పనుల నిమిత్తం కేంద్రం ఇచ్చే 3 శాతం అడ్మినిస్ట్రేటర్ చార్జీలు, రెండేళ్లుగా నిలుపుదల చేసిన వాహన బిల్లులు, నెలవారీ ఎఫ్‌టీఏ , ఔట్ సోర్సింగ్ సిబ్బంది జీతాల బకాయిలను చెల్లించాలని నినాదాలు చేశారు.



నిరసన వ్యక్తం చేస్తున్న పీఆర్ ఇంజనీరింగ్ శాఖాధికారులు

చలో విజయవాడకు వెళ్లొద్దు

● యూటీఎఫ్ నేతకు నోటీసు ● ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల మండిపాటు

బెలగాం, ఫిబ్రవరి 23: తమ సమస్యల పరిష్కారం కోసం ఉద్యోగ, ఉపాధ్యాయులు ఈ నెల 27న చలో విజయవాడకు పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. అయితే ఈ కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు సర్కారు ప్రయత్నిస్తోంది. దీనిలో భాగంగా పోలీసులతో నోటీసులు జారీ చేస్తోంది. ఈ మేరకు శుక్రవారం పార్వతీపురం మండలం బందలుప్పి జడ్పీ పాఠశాలలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మురళీమోహన్‌రావుకు పోలీసులు నోటీసు అందజేశారు. అయితే దీనిపై ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నేతలు మండిపడుతున్నారు. సర్కారు తీరుపై పెదవి విరుస్తున్నారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు లేదా? అని ప్రశ్నిస్తున్నారు. కాగా అక్రమ అరెస్టులు, నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరని యూటీఎఫ్ నేత మురళీ మోహన్‌రావు ఓ ప్రకటనలో తెలిపారు. 'చలో విజయవాడ'కు వెళ్లకూడదని ముందుగానే ఉద్యోగ, ఉపాధ్యాయులకు నోటీసులు ఇవ్వడం దుర్మార్గమైన చర్య అని పేర్కొన్నారు. ఉద్యోగులను భయపెట్టే విధంగా సర్కారు వ్యవహరిస్తోందన్నారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా, హౌస్ అరెస్టులు చేసినా పోరాటం కొనసాగిస్తామన్నారు. గతంలో సీఎం జగన్ ఇచ్చిన హామీల మేరకు సీపీఎస్ రద్దు చేయాలని, పీఆర్సీ అమలు, బకాయిలు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు.



యూటీఎఫ్ నేత మురళీమోహన్‌రావుకు నోటీసు ఇస్తున్న పోలీసు

మైనర్లకు వాహనాలివ్వొద్దు

● ట్రైనీ డీఎస్పీ మహేందర్

రాజాం రూరల్, ఫిబ్రవరి 23: మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ట్రైనీ డీఎస్పీ మహేందర్ స్పష్టం చేశారు. చిన్నారులకు ద్విచక్ర వాహనాలు ఇవ్వొద్దని తల్లిదండ్రులకు ఆయన సూచించారు. రాజాం రూరల్ సి.ఐ. శ్రీనివాసరావుతో కలిసి పాలకొండ రోడ్‌లో ద్విచక్ర వాహనాలు నడుపుతున్న పలువురు మైనర్లకు శుక్రవారం ఆయన కౌన్సిలింగ్ నిర్వహించారు. ప్రమాదాలు సంభవిస్తే జరిగే పరిణామాలను వారికి వివరించారు.

ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం కోసం సంతకాల సేకరణ

కొత్తవలస: కొత్తవలస జంక్షన్‌లో ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జికి సంబంధించి పాదచారుల కోసం రైల్వేలైనులపై ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేయాలని శృంగవరపుకోట సీపీఐ కార్యదర్శి డేగల అప్పలరాజు ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. వర్షాకాలంలో ఆర్‌యూబీ నీటితో నిండిపోవడంతో పాదచారులు నానా అవస్థలు పడుతున్నందున రైల్వేస్టేషన్‌లో ఏర్పాటు చేసిన మాదిరిగా ఇక్కడ కూడా రైల్వే లైనులపై ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేయాలన్నారు. ఈనెల 26న కొత్తవలస రైల్వేస్టేషన్‌కు ఉన్నతాధికారులు వస్తున్నందున ఆరోజున అధికారులకు వినతి పత్రంతో పాటు ప్రజాభిప్రాయానికి సంబంధించి సంతకాల సేకరణ చేసిన పత్రాలను అందజేయనున్నామన్నారు.

పది కిలోల గంజాయి పట్టివేత

శృంగవరపుకోట: మండలంలోని బొడ్డవర చెక్‌పోస్టు వద్ద ఇద్దరు వ్యక్తుల నుంచి పదికిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు ఇంచార్జి సీఐ షణ్ముఖరావు తెలిపారు. శుక్రవారం ఉదయం తనిఖీల్లో భాగంగా అరుకు నుంచి వస్తున్న ఒడిశా రాష్ట్రానికి చెందిన సోమసుందర్ నాయక్, పూర్తిఖిల్లాల వద్ద ఉన్న సంచిలో పదికిలోలల గంజాయి గుర్తించామన్నారు. కేసు నమోదుచేసి రిమాండ్‌కు పంపించామని తెలిపారు.

డ్రైనేజీ పనుల పరిశీలన

రాజాం/రూరల్: ఆగూరు ఎస్సీ కాలనీలో 15 ఆర్థిక సంఘ నిధులతో చేపడుతున్న డ్రైనేజీ పనులను ఎంపీడీవో బాసూరు శంకరరావు శుక్రవారం పరిశీలించారు. పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని ఇంజినీరింగ్ అధికారులను హెచ్చరించారు. ఆయనతో పాటు ఈవోపీఆర్డీ వి.శ్రీనివాసరావు ఉన్నారు.

5,186 ఇళ్ల పట్టాల పంపిణీ

కలెక్టరేట్: జిల్లాలో 5,186 మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేసినట్లు కలెక్టర్ నాగలక్ష్మి చెప్పారు. సీఎం జగన్ ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమానికి ఒంగోలులో శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేశారు. విజయనగరం మున్సిపాల్టీ పరిధిలో రెండో విడత కింద సారిక ఏబీసీడీ లేఅవుట్‌లో 3,403 మందికి, జమ్మునారాయణపురంలో 1053 మందికి, గుంకలాంలో 730 మందికి పట్టాలు పంపిణీ చేసినట్లు తెలిపారు.

మార్చి 3న కబడ్డీ పోటీలు

విజయనగరం రూరల్: విశాఖపట్టణంలో వచ్చే నెల 3 నుంచి రెండు రోజుల పాటు అంతర్ జిల్లాల సీనియర్ పురుషుల కబడ్డీ ఛాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించనున్నారు. దీనిలో పాల్గొనే క్రీడాకారుల ఎంపిక పోటీలు ఈ నెల 25న జిల్లా కేంద్రంలోని సిటీ క్లబ్‌లో నిర్వహించనున్నట్టు అసోసియేషన్ అధ్యక్షులు రంగారావు దొర శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడాకారులు 85 కిలోల లోపుల బరువు ఉండి... ఆధార్ కార్డు తీసుకుని హాజరుకావాలని తెలిపారు.

మోటార్ సైకిల్ చోరీలపై అప్రమత్తం

విజయనగరం క్రైం: నగరంలో ఇటీవల తరచూ మోటారు సైకిల్ దొంగతనాలు జరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని విజయనగరం వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వన్‌టౌన్ పోలీసులు, సిబ్బంది ప్రతి ఇంటిని సందర్శించి మోటార్ సైకిల్ దొంగతనాల ను నియంత్రించేందుకు తీసుకునే జాగ్రత్తలపై కరపత్రాలను అందజేశారు. ప్రతి ఒక్కరూ వీల్స్ లాక్, పెట్రోల్ లాక్ ఏర్పాటు చేసుకోవాలని కోరారు.

రేపు రాజాం రచయితల వేదిక సమావేశం

రాజాం: రాజాం రచయితల వేదిక 109వ సమావేశం ఈ నెల 25న స్థానిక మాధవ బజార్‌లోని ప్రాథమిక పాఠశాలలో జరుగుతుందని నిర్వాహకుడు గార రంగనాథం ఒక ప్రకటనలో శుక్రవారం తెలిపారు. సాహితీవేత్త నల్ల రవికుమార్ అధ్యక్షతన జరిగే సమావేశానికి సాహిత్యాభిమానులంతా హాజరు కావాలని రంగనాథం కోరారు.

సెపక్‌తక్రా క్రీడాకారులకు అభినందన

విజయనగరం దాసన్నపేట: నెల్లూరు జిల్లా ముతుకూరు తహసీల్దారు కార్యాలయ మైదానంలో ఈ నెల 24 నుంచి రెండు రోజుల పాటు జరగనున్న ఏపీ అంతర్ జిల్లాల సెపక్‌తక్రా ఛాంపియన్‌షిప్ పోటీలకు హాజరయ్యే బాలురు, బాలికలను జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గురాన అయ్యలు, సీహెచ్ వేణుగోపాలరావు శుక్రవారం అభినందించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి వై.రాజేష్, ఆర్గ నైజింగ్ కార్యదర్శి తదితరులు అభినందించారు.

ప్రపంచ శాంతి ర్యాలీ

బొబ్బిలి: ప్రపంచశాంతి, అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం బొబ్బిలి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులతో ర్యాలీ, సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు జేసీ రాజు మాట్లాడుతూ హింసకు తావులేకుండా అందరూ సహజీవనం సాగించాలన్నారు. కార్యక్రమంలో రోటరీ ప్రతినిధులు పాల్గొన్నారు.

రైతు మృతిపై నిరసన

కొత్తవలస: పోలీసు కాల్పులలో రైతు మృతి చెందడంపై ఉపాధి కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఢిల్లీ సరిహద్దులలో తమ సమస్యల పరిష్కారం కోసం నిరసన చేస్తున్న వారిపై కాల్పులు, లాఠీలు ఝుళిపించడంతో ఒక యువరైతు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈమేరకు జిల్లా వ్యవసాయ కార్మిక సంఘ అధ్యక్షుడు గాడి అప్పారావు ఆధ్వర్యంలో వీరభద్రపురం పంచాయతీ కర్రి చిన్నయ్యపాలెం గ్రామంలో ఉపాధి కార్మికులు సంతాపం వ్యక్తం చేశారు. అనంతరం ప్రభుత్వ తీరుపై నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రైతులు రమణ, రాము, లక్ష్మి, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

రేగిడి: మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఉదయం 10 గంటలకు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శ్యామలా కుమారి శుక్రవారం విలేకరులకు తెలిపారు. ఎంపీపీ దార అప్పల నరసమ్మ అధ్యక్షతన నిర్వహించనున్నారన్నారు.

వ్యూహం సినిమాను బహిష్కరించాలి

శృంగవరపుకోట: కులాల మధ్య చిచ్చుపెట్టేందుకు వస్తున్న వ్యూహం, శపథం సినిమాలను బహిష్కరించాలని సౌత్‌ఇండియన్ కాపుసంఘ జిల్లా అధ్యక్షుడు ఒబ్బిన సన్యాసినాయుడు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ముఖ్యమంత్రి జగన్ డైరెక్షన్లో రాంగోపాల్‌వర్మ ఈ సినిమాలు రూపొందించారని ఆరోపించారు. ఈ సినిమా దర్శక, నిర్మాతలు జగన్ కోసం ఆంధ్రరాష్ట్ర ద్రోహులుగా మారడం శోచనీయమన్నారు.

నియంత పాలనకు స్వస్తి చెబుదాం

● మాజీ మంత్రి కోండ్రు మురళి

రాజాం, ఫిబ్రవరి 23: నియంతపాలనకు స్వస్తి చెప్పే సమయం ఆసన్నమైందని మాజీ మంత్రి, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కోండ్రు మురళీమోహన్ అన్నారు. శుక్రవారం శ్యాంపురం క్యాంపు కార్యాలయంలో వంగర మండలం కింజంగి ఆర్‌ఆర్ కాలనీకి చెందిన 30 వైసీపీ కుటుంబాల వారు ఆ పార్టీని వీడి టీడీపీలో చేరారు. నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కోండ్రు మురళీమోహన్ వారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. అనంతరం కోండ్రు మాట్లాడుతూ సీఎం జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత నియంతలా వ్యవహరిస్తున్నాడని... ఈ పాలనకు స్వస్తి చెప్పే సమయం ఆసన్నమైందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలకు కేటాయించిన నిధులను సైతం దారి మళ్లించి... సర్పంచ్‌లకు తీరని అన్యాయం చేస్తున్నాడని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో బొత్స వాసుదేవరావు నాయుడు, పిన్నింటి మోహన్‌రావు, యలకల దుర్గాప్రసాద్, బెజ్జిపురపు రవి, మజ్జి గణపతి పాల్గొన్నారు. పార్టీలో చేరిన వారిలో చీమల సత్యనారాయణ, చీమల గణపతి, కృష్ణ, గణనాథ, పాడి రాంబాబు, సత్యనారాయణ, జోగి స్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారిని ఆహ్వానిస్తున్న కోండ్రు

కలిసి కట్టుగా పనిచేస్తేనే విజయం

వచ్చే ఎన్నికల్లో అందరం కలిసి కట్టుగా పని చేస్తే విజయం తథ్యమని మాజీ మంత్రి నియోజకవర్గ ఇన్‌చార్జి కోండ్రు మురళీమోహన్ పిలుపునిచ్చారు. శుక్రవారం శ్యాంపురం పార్టీ కార్యాలయంలో వంగర మండలం బాగెమ్మపేట, ఎం.సీతారాంపురం, శివ్వాం, వంగర, సంగాం, మగ్గూరు, మద్దువలస, కొత్తవలస, కొట్టిశ, కొప్పరవలస, శ్రీహరిపురం, కింజంగి ఆర్‌ఆర్ కాలనీ, అరసాడ, ఓని అగ్రహారం గ్రామాల నాయకులు, పార్టీ అభిమానులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఎన్నికల్లో వైసీపీ మాయమాటలకు ప్రజలు మోసపోయారని, ఈ ఎన్నికల్లో అటువంటి పరిస్థితి రాకుండా జాగ్రత్త పడాలన్నారు. వర్గ విభేదాలను వీడి అందరూ కలిసికట్టుగా పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పిన్నింటి మోహన్‌రావు, మాజీ జెడ్పీటీసీ బొత్స వాసుదేవరావునాయుడు తదితరులు పాల్గొన్నారు.

● టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో శ్రీకాకుళంలో ఈ నెల 26న 'రా కదలిరా' కార్యక్రమం నిర్వహించనున్నట్టు కోండ్రు మురళీమోహన్ తెలిపారు. ఈ కార్యక్రమానికి అన్ని నియోజకవర్గాల నుంచి భారీగా జన సమీకరణ చేయాలని శ్రేణులకు పిలుపునిచ్చారు. శుక్రవారం శ్రీకాకుళం టీడీపీ కార్యాలయంలో ముఖ్య నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ సత్తా ఏమిటో ఈ కార్యక్రమంతో వైసీపీ నాయకులకు అర్థమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు కూన రవికుమార్, గుండ లక్ష్మీదేవి, ఎమ్మెల్యే బి.అశోక్, చౌదరి బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

ఈ ప్రభుత్వంలో దేవాలయాలకే రక్షణ లేదు

● టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అదితి గజపతిరాజు

విజయనగరం రూరల్, ఫిబ్రవరి 23: హిందూ దేవాలయాలు, అర్చకులపై దాడులు జరిగినా ఈ ప్రభుత్వం కనీసం స్పందించలేదని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అదితి గజపతిరాజు విమర్శించారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో టీడీపీ బ్రాహ్మణ విభాగం ఆధ్వర్యంలో జరగనున్న 'బాబు చెంతకు బ్రాహ్మణాస్త్రం.. బాధిత బ్రాహ్మణుల విముక్తికి జనసేనతో సిద్ధం' కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను బ్రాహ్మణ విభాగం నాయకులతో కలిసి అదితి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో ఐదేళ్ల కాలంలో 237 దేవాలయాలపై దాడులు జరిగాయన్నారు. ఈ దాడులకు పాల్పడే వారిపై చర్యలు తీసుకోలేదన్నారు. 'రామతీర్థం'లోని నీలాచలం కొండపై కోదండరాముని తల నరికిన వాడిని సైతం ఈ ప్రభుత్వం పట్టుకోలేకపోయిందని విచారం వ్యక్తం చేశారు. కనీసం విచారణ ముందుకు నడిపించలేదన్నారు. బ్రాహ్మణ నాయకులు రాకేష్‌శర్మ, డాక్టర్ పేరి రామయ్య పంతులు తదితరులు మాట్లాడుతూ 2014 నుంచి 2019 వరకూ బ్రాహ్మణులకు సువర్ణయుగమన్నారు. ఈ ప్రభుత్వం ఎటువంటి కార్యక్రమాలు నిర్వహించకపోగా, హిందూ దేవాలయాలు, అర్చకులపై దాడులకు పాల్పడిందన్నారు. బాధ్యులపై చర్య లు తీసుకోలేదని ఆరోపించారు. బ్రాహ్మణులకు తిరిగి స్వర్ణయుగం రావాలని కోరు కుంటూ టీడీపీ బ్రాహ్మణ విభాగం ఆధ్వర్యంలో 'బాబు చెంతకు బ్రాహ్మణాస్త్రం.. బాధిత బ్రాహ్మణుల విముక్తికి జనసేనతో సిద్ధం' అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని చెప్పారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న అదితి

ప్రశాంతంగా ఎన్నికలకు చర్యలు

● ఎస్పీ దీపికా పాటిల్

రామభద్రపురం, ఫిబ్రవరి 23: రానున్న పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలు సజావుగా, శాంతియుతంగా జరిగేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్టు ఎస్పీ దీపికా పాటిల్ తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్‌ను శుక్రవారం సాయంత్రం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో సమస్యాత్మక గ్రామాలను గుర్తించామని.. ఎటువంటి వివాదాలు, తగవులు లేకుండా ఉండేందుకు బైండోవర్ కేసులు నమోదు చేస్తున్నామని తెలిపారు. స్థానిక పోలీసులతో పాటు 4 వేల మంది పారా మిలిటరీ పోలీసులను కూడా నియమించనున్నట్టు తెలిపారు. జిల్లాలో ఇప్పటికే 4 చెక్‌పోస్టులు ఉన్నాయని, ఎన్నికల కోసం మరో 15 చెక్‌పోస్టులు ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. అక్రమ మద్యం, గంజాయి, డబ్బు రవాణా నిరోధించడానికి గట్టి చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఎన్నికల కోడ్ సక్రమంగా అమలయ్యే విధంగా చర్యలు చేపడతామన్నారు. అంతకు ముందు రిపీటర్ స్టేషన్, పోలీసు స్టేషన్‌లను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ తనిఖీల్లో డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ ఎస్.తిరుమలరావు, ఎస్ఐ జ్ఞానప్రసాద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ దీపికాపాటిల్

పరీక్ష కేంద్రాల్లో సదుపాయాలు కల్పించాలి

విజయనగరం దాసన్నపేట, ఫిబ్రవరి 23: పరీక్ష కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని హ్యూమన్ రైట్స్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాండ్రంకి సంతోష్ కుమార్ కోరారు. శుక్రవారం బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావును ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సంతోష్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు ఎటువంటి ఇబ్బందులకు గురికాకుండా... ప్రశాంతంగా పరీక్షలు రాసే విధంగా ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. కేసలిని కలిసిన వారిలో సంస్థ ప్రతినిధులు ఎం.అప్పారావు, పెంకి అశ్విని, మురళి, రూపావతి, శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.



అప్పారావుకు వినతిపత్రం అందిస్తున్న హ్యూమన్ రైట్స్ ప్రతినిధులు

6,077 ఇళ్ల నిర్మాణం పూర్తి

రేగిడి, ఫిబ్రవరి 23: రాజాం హౌసింగ్ సబ్ డివిజన్ పరిధిలోని నాలుగు మండలాల్లో 2019 నుంచి వివిధ పథకాల్లో మంజూరైన 11,098 గృహాలకు గాను 6,077 పూర్తయ్యాయని హౌసింగ్ ఈఈ ఎన్‌జే రత్నాకర్ తెలిపారు. నిర్మాణదారులందరికీ ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లిస్తున్నామని తెలిపారు. రేగిడి హౌసింగ్ కార్యాలయాన్ని శుక్రవారం సందర్శించిన ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. లబ్ధిదారులకు బిల్లుల సమస్య లేదని, నిర్మాణ దారులందరికీ తక్షణమే చెల్లించేలా చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. ముందుగా రేగిడి హౌసింగ్ ప్రగతి, బిల్లుల చెల్లింపులపై ఆరా తీశారు. ఆయన వెంట వర్క్ ఇన్‌స్పెక్టర్ శివ తదితరులు ఉన్నారు.



రేగిడి హౌసింగ్ వివరాలపై అరా తీస్తున్న ఈఈ రత్నాకర్

వాటర్ వర్క్స్ పరిశీలన



వాటర్‌వర్క్స్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్, డీఈఈ

బొబ్బిలి, ఫిబ్రవరి 23: బొబ్బిలి మున్సిపాలిటీ లో వాటర్ వర్క్స నిర్వహ ణకు సంబంధించి విపరీత మైన ఆరోపణలు వెల్లువె త్తుతున్న నేపథ్యంలో శుక్ర వారం మున్సిపల్ కమీషన ర్ లాలం రామలక్ష్మి భోజ రాజపురం వాటర్‌వర్క్స్‌ను పరిశీలించారు. వేగావతి నదిలో ఉన్న ఇన్‌ఫి ల్ట్రేషన్ బావులను తొలుత పరిశీలించారు. 30 హెచ్‌పీ, 100 హెచ్‌పీ మోటార్ల పనితీరుపై ఆరా తీశారు. మరమ్మతులకు గురైన మోటార్లన వినియోగంలోనికి తీసుకురావాలని డీఈఈనిఆదేశించారు. వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా నీటి పంపింగ్, సరఫరా వ్యవస్థనంతటినీ సమర్థవంతంగా సిద్ధంగా ఉంచాలన్నారు. ఇన్‌ఫి ల్ట్రేషన్ బావులకు నీరు చేరేలా ఇసుక గట్లను గట్టిగా ఏర్పాటు చేయాలన్నారు. క్లోరినేషన్ విధానాన్ని తనిఖీ చేశారు. ఏఈలు రవికుమార్, సురేష్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

సంకిలిలో పారిశుధ్య పనులు

రేగిడి, ఫిబ్రవరి 23: సంకిలి పంచాయతీలో శుక్రవారం సర్పంచ్ బి.పట్టాభి ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు చేపట్టారు. పంచాయితీ కార్యదర్శి శివరామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సంకిలిలో ప్రొక్లెయినర్‌తో పారిశుధ్య నిర్వహణ చేపడుతున్న దృశ్యం



రైతులపై కాల్పులు దేశానికే అవమానం



ఎస్.కోటలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

శృంగవరపుకోట, ఫి బ్రవరి 23: దేశానికి అన్నంపెట్టే రైతులపై కాల్పులు జరిపి దేశాన్ని అవమానించారని సీఐటీయూ జిల్లా కార్యదర్శి మద్దిల రమణ అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన శృంగవరపుకోటలో కాల్పుల ఘటన నిరసిస్తూ నిరసన కార్యక్రమం నిర్వహించారు. రైతుల డిమాండ్లను నెరవేర్చాలని, కేంద్ర ప్రభుత్వం తీరు మార్చుకోవాలని నినదించారు. దేవీ జంక్షన్ నుంచి ఆర్‌టీసీ కాంప్లెక్స్ వరకూ ర్యాలీ చేశారు.

సచివాలయం ఎదుట దళితుల నిరసన

రాజాం, ఫిబ్రవరి 23: పెనుబాక గ్రామ సచివాలయం ఎదుట దళితులు శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. అదే గ్రామానికి చెందిన బలగ లక్ష్మణరావు 15 ఏళ్లుగా ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించేవారు. తొమ్మిది నెలల కిందట మరణించడంతో తన కుమారుడు అరుణ్ కుమార్‌కు ఆ బాధ్యతలను అప్పగించారు. ఫీల్డ్ అసిస్టెంట్‌గా పూర్తి బాధ్యతలను అప్పగించాలని గ్రామ పెద్దలను కోరినప్పటికీ కనీసం స్పందించకుండా... వైసీపీ నాయకులు వేరే వ్యక్తికి అప్పగించడానికి ప్రయత్నిస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు. దీంతో దళితులు ఏకమై గ్రామ సచివాలయం వద్ద శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. తండ్రి మరణించిన తరువాత తన కుమారుడికి ఆ బాధ్యతలు అప్పగించాలని అడగడంలో తప్పేమిటని ప్రశ్నిస్తున్నారు.



పెనుబాక సచివాలయం వద్ద నిరసన చేపడుతున్న దళితులు

లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలి

● సీనియర్ సివిల్ న్యాయాధికారి బాబు

రాజాం రూరల్, ఫిబ్రవరి 23: వచ్చేనెల 9న నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ అయ్యేలా న్యాయవాదులు, పోలీసులు, ఇతర అధికారులు సహకరించాలని మండల న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి ఎం.బాబు సూచించారు. ఇక్కడి కోర్టు ఆవరణలో జూనియర్ సివిల్ జడ్జి కృష్ణ సాయితేజతో కలిసి ఆయన న్యాయవాదులతో సమావేశమయ్యారు. రాజీకి అనుకూలమైన వీలైనన్ని ఎక్కువ సివిల్, క్రిమినల్, ప్రీ లిటిగేషన్ కేసులు పరిష్కరించుకునేలా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. అదాలత్‌లో పరిష్కరించుకున్న సివిల్ కేసులకు ఫీజు వాపస్ చేయనున్నట్టు వెల్లడించారు. సమావేశంలో ఏజీపీ శెట్టి పోలారావు, న్యాయవాదులు భవానీప్రసాద్, రమణమూర్తి, రెడ్డి రామ్మూర్తి, విజయకుమార్, సత్యనారాయణ, ఈశ్వరరావు, సత్యనారాయణ, శ్రీనివాస్, శంకరరావు, శ్రీనివాసరావు, మురళి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్నన్యాయాధికారి బాబు

మళ్లీ వాయిదా..

● మున్సిపాలిటీ ఆశీలు వేలానికి ముందుకు రాని కాంట్రాక్టర్లు

రాజాం రూరల్, ఫిబ్రవరి 23: రాజాం మున్సిపాలిటీ ఆశీళ్లకు సంబంధించిన వేలంపాట మూడోసారి వాయిదా పడింది. మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ రామ అప్పలనాయుడు, మేనేజర్ నాగరాజు సమక్షంలో వేలంపాట నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినా కాంట్రాక్టర్లు ససేమిరా అన్నారు. వేలంపాటలో పాల్గొనేది లేదని స్పష్టం చేశారు. దీంతో చేసేదిలేక కమిషనర్ ఈనెల 26న వేలంపాట నిర్వహించనున్నట్లు ప్రకటించి వాయిదా వేశారు.

● **ఎందుకిలా..**

రాజాంలో డైలీ మార్కెట్ ఇతరత్రా వ్యాపారస్థుల నుంచి ఆశీళ్లు వసూలు చేసుకునే హక్కు పొందేందుకు వీలుగా వేలంపాటను ఏడాదికోమారు నిర్వహిస్తు న్నారు. ఇందుకు సంబంధించి ప్రభుత్వం నిర్ణయించిన ప్రారంభ ధర రూ.34.50 లక్ష లుగా నిర్ణయించారు. ఈమొత్తంతో పాటు అదనంగా 18 శాతం జీఎస్టీ కలిపి సుమారు రూ.38 లక్షలు ప్రారంభ ధరగా మున్సిపల్ అధికారులు నిర్ణయించారు. దీంతో కాంట్రాక్టర్లు ససేమిరా అన్నారు. ధర తగ్గించాలని లేకుంటే జీఎస్టీ లేకుండా ప్రారంభ ధరను పరిగణనలోనికి తీసుకోవాలని కాంట్రాక్టర్లు గత కొంతకాలంగా డిమాండ్ చేస్తున్నారు. అయితే అలాంటి నిర్ణయం తీసుకునే అధికారం తనకు లేదని కమిషనర్ రామ అప్పలనాయుడు స్పష్టం చేయడంతో వేలంపాట నిర్వహణ మరోసారి వాయిదా పడింది. శుక్రవారం ఈ మేరకు కమిషనర్ కు వినతిప్రతం అందజేశారు.



కమిషనర్‌కు వినతిపత్రమిస్తున్న కాంట్రాక్టర్లు

గ్రీన్ అంబాసిడర్ల జీతాలు చెల్లించాలి



ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న గ్రీన్ అంబాసిడర్లు

బాడంగి, ఫిబ్రవరి 23: గ్రీన్ అంబాసిడర్ల జీతాలు చెల్లించాలని డి మాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక ఎంపీ డీవో కార్యాలయాన్ని శుక్ర వారం ముట్టడించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నా యకులు ఎ.సురేష్ మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నుంచి నిధులు వచ్చిన ప్పటికీ గ్రీన్ అంబాసిడర్లకు జీతాలు ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. రెండేళ్ల నుంచి జీతాలు అందకపోతే వారి కుటుంబాలతో ఎలా బతకాలని ప్రశ్నించారు. ధ ర్నా చేస్తున్న గ్రీన్ అంబాసిడర్ల వద్దకు ఈవోపీఆర్‌డీ వచ్చి.. 7 రోజుల్లో సమస్య పరి ష్కరిస్తానని రాతపూర్వకంగా హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో గ్రీన్ అంబాసిడర్లు, కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు ద్రోహం

బాడంగి: నకిలీ ధ్రువపత్రాలతో అభ్యర్థులకు టిక్కెట్లు ఇచ్చి నిజమైన గిరిజనులకు ద్రోహం చేస్తున్నారని టీడీపీ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు డాక్టర్ కొండారెడ్డి నరహరిప్రసాద్ అన్నారు. శుక్రవారం లక్ష్మీపురం పంచాయతీలో టీడీపీ ఎస్టీ కమిషన్ జనరల్ సెక్రటరీ, ఎంపీటీసీ పాలవలస గౌరు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నకిలీ ధ్రువపత్రాలతో గిరిజనురాలిగా గుర్తింపు పొందిన పాముల పుష్పశ్రీవాణిని సీఎం జగన్..ఎమ్మెల్యేగా, మంత్రిగా పదవులు కట్టబెట్టి ఏజెన్సీ గిరిజనుల హక్కులను హరించారన్నారు. రాష్ట్ర విభజన అనంతరం రిజర్వేషన్ ప్రకారం 11 ఎమ్మెల్యే, రెండు ఎంపీ స్థానాలు గిరిజనులకు కేటాయించాల్సి ఉందన్నారు. కానీ విభజనకు ముందు లాగానే ఏడుగురు ఎమ్మెల్యేలు, ఒక ఎంపీ ఉన్నారని అన్నారు. గిరిజనుల నిరుద్యోగాన్ని తరిమికొట్టి వారిని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు, వైస్ ఎంపీపీ సింగిరెడ్డి భాస్కరరావు, మండల టీడీపీ అధ్యక్షులు తెంటు రవిబాబు, కార్యదర్శి ఎల్.సత్యం, మాజీ ఎంపీపీ బంటు త్రినాథ, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నరహరిప్రసాద్

రెండు పూటల పనులు వద్దు



కోమటిపల్లిలో ఆందోళన చేస్తున్న ఉపాధికూలీలు

బొబ్బిలి ఫిబ్రవరి 23: ఉపాధి హామీ పథకం కింద ఏడాదికి రెండొందల రోజులు పని కల్పించాలని.. రెండు పూటలా పని చేయాలనే నిబంధన తొలగించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పి.శంకరరావు డిమాండ్ చేశారు. కోమటిపల్లిలో శుక్రవారం ఉపాధి కూలీల సమస్యలపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు పూటలా పని, ముఖహాజరు సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేసి ఉపాధి హామీ కూలీలను తగ్గించడానికి కేంద్రం అనేక జిమ్మిక్కులు చేస్తోందని ఆరోపించారు. ఉపాధి హామీ పథకాన్ని కాపాడుకోవాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 26న బొబ్బిలి ఆర్డీఓ కార్యాలయం ముందు ధర్నా చేయనున్నట్లు శంకరరావు తెలివపారు. ఈ కార్యక్రమంలో ఎస్.గోపాలం తదితరులు పాల్గొన్నారు.

దళితులకే పట్టాలు ఇవ్వాలి

కొత్తవలస, ఫిబ్రవరి 23: దెందేరు, సంతపాలెం గ్రామాలలో దళితులకు గతంలో ఇచ్చిన డి.పట్టా భూములను తిరిగి వారికే ఇవ్వాలని మాలమహానాడు నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం తహశీల్దార్ వి.చంద్రశేఖర్‌ను మాల మహానాడు నాయకులు కలసి వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం భూముల రీసర్వేలో గతంలో పట్టాలు ఎవరికిచ్చారో వారి పేర్లనే నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు దెందేటి దేముడుబాబు, కణితి విజయ్ కుమార్, పతివాడ నాగభూషణం, వంకర అర్జునరావు, మొయ్యి పైడయ్య తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహం వద్ద మాట్లాడుతున్న నాయకులు

జగన్నాథపురంలో ఎంపీడీవో పర్యటన



మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేస్తున్న దృశ్యం

బొబ్బిలి: మండలంలోని జగన్నాథపురం గ్రామంలో ఎంపీడీవో రవికుమార్ శుక్రవారం పర్యటించారు. తొలు త గ్రామంలో గల రెండు అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. పిల్లల హాజరు, వారికి అందజేస్తున్న పౌష్టికా హారం, పిల్లల బరువు తదితర అంశాలకు సంబంధించి రికార్డులను పరిశీలించారు. మండలపరిషత్ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. నాణ్యత, పరిమాణంపై విద్యార్థుల నుంచి ఆరా తీశారు. అనంతరం ఆధార్ శిబిరాన్ని సందర్శించారు. మండల కోఆర్డినేటర్ సుధాకర్, వీఆర్వో, మహిళా పోలీసు, ఏఎన్ఎం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జిందాల్ భూ నిర్వాసితులకు అండగా ఉంటా

శృంగవరపుకోట రూరల్, ఫిబ్రవరి 23: మండలంలోని జిందాల్ భూనిర్వాసితులకు ఎల్లవేళల అండగా ఉండి వారి తరపున మాట్లాడుతానని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు. శుక్రవారం జిందాల్ కార్యాల యం వద్ద నాలుగురోజులుగా నిరసన వ్యక్తంచేస్తున్న బాధితులను కలిసి సంఘీభా వం తెలిపారు.



శిబిరం వద్ద ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు

కబడ్డీ పోటీలకు జిల్లా నుంచి న్యాయనిర్ణేతలు

విజయనగరం రూరల్, ఫిబ్రవరి 23: విశాఖపట్టణం పోర్టు స్టేడియంలో ఈ నెల 23 నుంచి ప్రారంభమైన కబడ్డీ ఛాంపియన్ షిప్ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా నెల్లిమర్ల సీకే యూజేడీ కళాశాల విశ్రాంత పీడీ బొమ్మన రామారావు, కుమిలి జడ్పీ హైస్కూల్ పీడీ ఏఎంఎస్ కమలనాభరావు, అలుగోలు జడ్పీ హైస్కూల్ పీడీ ఎస్.సూర్యారావులు వ్యవహరిస్తున్నారు. వీరిని కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధులు, క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు ఒక ప్రకటనలో అభినందించారు.



న్యాయ నిర్ణేతలుగా ఎంపికైన పీడీలు

టెన్త్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి


ప్రీఫైనల్ పరీక్షలు పరిశీలిస్తున్న డీఈవో

పాలకొండ: ఈ ఏడాది పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని పార్వతీపురం మన్యం జిల్లా డీఈవో జి.పగడాలమ్మ సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షల్లో పాల్గొననున్న చీఫ్, డీవోలకు శుక్రవారం సూచనలు, సలహాలు అందించారు. పట్టణంలోని పెద్దకాపువీధి జెడ్పీహెచ్ఎస్ పాఠశాలను సందర్శించారు. ప్రీఫైనల్ పరీక్షల తీరును పరిశీలించారు.

ఎండీఎంను పర్యవేక్షించాలి


విద్యార్థుల వర్క్ పుస్తకాలను పరిశీలిస్తున్న విజయనగరం డీఈవో ప్రేమ్‌కుమార్

చీపురుపల్లి: పాఠశాలల్లో మెనూ ప్రకారం ఎండీఎం అమలవుతున్నదీ లేనిదీ ఉపాధ్యాయులు గమనించాలని డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్ సూచించారు. చీపురుపల్లిలోని ప్రభుత్వ పాఠశాలలను ఆయన శుక్రవారం సందర్శించారు. బాలుర ఉన్నత పాఠశాలలో 8, 9వ తరగతి విద్యార్థులతో మాట్లాడారు. బైజూస్ విషయ పరిజ్ఞానానికి సంబంధించి తప్పనిసరిగా ట్యాబ్‌లను వినియోగించా లన్నారు. ఐఎఫ్‌పీలను ఉపయోగించి విద్యాబోధన చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజన పథకం అమలవుతున్నదీ లేనిదీ ఉపాధ్యాయులు గమనించాలన్నారు. అనంతరం విజయ రాంపురం ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల విద్యా సామర్థ్యా లను పరిశీలించారు. విద్యార్థులు రాసే వర్క్ పుస్తకాల్లో ప్రతి పేజీని ఉపాధ్యా యులు క్షుణ్ణంగా పరిశీలించి, తప్పులు సరిదిద్ది రిమార్క్ రాయాలన్నారు. ఆయన వెంట జిల్లా కామన్ పరీక్షల బోర్డు కార్యదర్శి టి.సన్యాసిరాజు, ఎంఈవో ఎం.బూసినాయుడు, బాలుర ఉన్నత పాఠశాల హెచ్ఎం కె.చంద్రశేఖర్‌కుమార్, సీఆర్పీ కంది రామకృష్ణ తదితరులు ఉన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

- జిల్లా మలేరియా అధికారి జగన్మోహన్‌రావు

పార్వతీపురం రూరల్: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా మలేరియా అధికారి టి.జగన్మోహన్‌రావు పిలుపునిచ్చారు. చందలంగి గ్రామంలో శుక్రవారం డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. కాలువల్లో నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న చెత్తను తొలగించారు. ఇళ్లల్లో దోమతెరలు వినియోగిస్తున్న తీరును పరిశీలించారు. గ్రామంలో ఎవరికైనా జ్వరాలు, ఇతర ఆరోగ్యపరమైన సమస్యలు ఉన్నాయా.. అని స్థానికులను, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గర్భిణులు ఉన్న గృహాలను సందర్శించి ఆరోగ్య పరిశీలన చేశారు. అనంతరం డాక్టర్ జగన్మోహన్‌రావు చినమరికి గ్రామంలో వెల్‌నెస్ కేంద్రాన్ని సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి ధనుంజయరావు, సూపర్‌వైజర్ సత్తిబాబు, వైద్య సిబ్బంది కృష్ణవేణి, నిహారిక, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పల్స్ పోలియోను విజయవంతం చేద్దాం

గరుగుబిల్లి: వచ్చే నెల 3న నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గరుగుబిల్లి, రావివలస పీహెచ్‌సీల వైద్యాధికారులు సంతోష్‌కుమార్, కె.కార్తీక్ కోరారు. శుక్రవారం స్థానిక పీహెచ్‌సీలో పల్స్ పోలియో కార్యక్రమంపై మండల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఐదేళ్లలోపు పిల్లలందరికీ పల్స్ పోలియో చుక్కలను వేస్తారని, ఈ మేరకు ఆయా గ్రామాల్లో కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. లక్ష్యానికి మించి పల్స్ పోలియో చుక్కలను వేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఈ సమావేశంలో ఈవోపీఆర్డీ ఎల్.గోపాలరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

భోజన నిర్వాహకులకు కనీస వేతనం చెల్లించాలి

పాచిపెంట: మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు కనీస వేతనం రూ.10 వేలు చెల్లించాలని సీఐటీయూ నాయకులు కోరాడ ఈశ్వరరావు కోరారు. శుక్రవారం పాంచాళి హైస్కూల్ వద్ద నిర్వాహకుల సమక్షంలో మాట్లాడారు. ప్రతి నెల 5వ తేదీలోపు వేతనం చెల్లించాలని.. గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలని, యూనిఫాం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చి మధ్యాహ్న భోజన నిర్వాహకులను ఆదుకోవాలని కోరారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దు

గరుగుబిల్లి: గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని స్థానిక ఎస్ఐ వై.అమ్మన్నరావు హెచ్చరించారు. శుక్రవారం సాయంత్రం ఉల్లిభద్రలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు చర్యలు చేపడతున్నామని చెప్పారు. సమస్యాత్మక, అతి సమస్యాత్మక గ్రామాలను గుర్తించి అవగాహన కల్పిస్తున్నామన్నారు. అనుమతులు లేకుండా మద్యం అమ్మకం చేయరాదన్నారు. బెల్టు దుకాణాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

టైర్ రీట్రేడింగ్ షాప్‌లో అగ్నిప్రమాదం

పాలకొండ: పట్టణంలోని రాజాం వెళ్లే మార్గంలో వెంకటసాయి దుర్గా టైర్ రీట్రేడింగ్ షాప్‌లో మధ్యాహ్నం మూడు గంటల సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగింది. షాప్‌లో రబ్బరు ముడి పదార్థం 175 కిలోలు, బాండింగ్ గమ్ బ్యాగ్‌లు, సొల్యూషన్‌గమ్, రోలింగ్ మిషిన్, రిబ్టెనింగ్ టైర్లు ఆరు అగ్నికి ఆహుతయ్యాయి. సుమారు రెండు లక్షల రూపాయల ఆస్తినష్టం జరిగిందని షాపు యజమాని తెలిపారు. పాలకొండ అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించడంతో మంటలు మరింత విస్తరించకుండా అగ్నిమాపక సిబ్బంది శకటంతో వచ్చి మంటలను అదుపుచేశారు.

ఎండీయూ ఆపరేటర్లు నిబంధనలు పాటించాలి


చీపురుపల్లి: ఎండీయూ ఆపరేటర్లు తప్పనిసరిగా ప్రభుత్వ నిబంధనలు పాటించాలని సీఎస్‌డీటీ పి.రామారావు సూచించారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన గరివిడి, రాజాం సీఎస్‌డీటీలు చిరంజీవి, శోభారాణిలతో కలిసి ఆపరేటర్లతో సమావేశం నిర్వహించారు. నిబంధనల ప్రకారం ఆపరేటర్లు సరుకులను లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందజేయాలన్నారు. రేషన్ డిపోల్లో సరుకులు పంపిణీ చేసినట్టు ఫిర్యాదులొస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో చీపురుపల్లి, మెరకముడిదాం మండలాల ఎండీయూ ఆపరేటర్లు పాల్గొన్నారు.

జనసేనలో చేరిక


పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఇన్‌చార్జి శ్రీనివాసరావు

చీపురుపల్లి: గుర్ల మండలంలోని పెదబంటుపల్లి గ్రామానికి చెందిన పది కుటుంబాలు శుక్రవారం జనసేన పార్టీలో చేరాయి. చీపురుపల్లిలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి విసినిగిరి శ్రీనివాసరావు వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో ఆర్.పైడిరాజు, ఎం.రామకృష్ణ, బి.గౌరీశంకర్, కె.లోకేష్, కె.రోహిత్, ఎం.రమణ. కె.పైడిరాజు తదితరులు వారి కుటుంబ సభ్యులతో జనసేన తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివారావు మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడి పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రామచంద్రుడు, జె.ఆదినారాయణ, ఎస్.సింహాచలం, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ హయాంలో పెరిగిన దాడులు


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

గుర్ల: వైసీపీ హయాంలో దాడులు, కేసులు విపరీతంగా పెరిగాయని మండల ప్రెస్ కమిటీ సభ్యులు మజ్జి రామారావు, చందక సూర్యనారాయణ అన్నారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ రమాదేవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో పత్రికాస్వేచ్ఛకు భంగం కలిగించే విధంగా ప్రభుత్వాలు నడుస్తున్నాయన్నారు. పాత్రికేయులపై ఇటీవల దాడులకు పాల్పడిన నిందితులను వెంటనే అరెస్టు చేసి శిక్షించాలన్నారు. వారి వెంట తౌడు, అసిరప్పడు, రామారావు, సత్యనారాయణ, నరసింహమూర్తి, రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

రానున్నది టీడీపీ ప్రభుత్వమే

- పార్టీ పొలిట్ బ్యూరో సభ్యురాలు సంధ్యారాణి


పార్టీలో చేరినవారిని కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న సంధ్యారాణి

మెంటాడ: వైసీపీ ప్రభుత్వం నుంచి ఎంతవేగంగా బయట పడాలోనని ప్రజలు చూస్తున్నారని, రాబోయేది టీడీపీ ప్రభుత్వమేనని పార్టీ పొలిట్ బ్యూరో సభ్యురాలు గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. శుక్రవారం రాబందలో ఏర్పాటు చేసిన బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోనే రాష్ట్రానికి దశ దిశ అని ప్రజలు గ్రహించారని అన్నారు. టీడీపీ, జనసేన ప్రభుత్వం ఏర్పాటుతో వైసీపీ విధ్వంసానికి, అరాచకానికి ముగింపు తథ్యమని వ్యాఖ్యానించారు. అయిదేళ్ల జగన్ ఏలుబడిలో రాష్ట్రం చిన్నాభిన్నమైందని ధ్వజమెత్తారు. చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను ఆమె ప్రజలకు వివరించారు. ప్రభుత్వ విధానాలకు విసిగి వేసారిన 50 మంది వైసీపీ, బీజేపీలను వీడి టీడీపీలో చేరారు. వారికి సంధ్యారాణి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

చంద్రబాబు సీఎం కావడం అవసరం

- టీడీపీ పార్వతీపురం నియోజకవర్గ ఇన్‌చార్జి విజయచంద్ర


విజయచంద్రకు హారతులిస్తున్న దృశ్యం

పార్వతీపురం రూరల్: రాష్ట్రానికి చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం ఎంతో అవసరమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బోనెల విజయచంద్ర అన్నారు. శుక్రవారం బందులొపి గ్రామంలో టీడీపీ మండల అధ్యక్షుడు బి.చంద్రమౌళి ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని, ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గొట్టాపు వెంకటనాయుడు, పి.సత్యనారాయణ, వేణుగోపాలనాయుడు, బార్నాల సీతారాం, శంకరరావు, కర్రి బలరాంనాయడు, చిన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి అభ్యర్థి గెలుపునకు కృషి

- టీడీపీ కురుపాం నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వరి


మాట్లాడుతున్న జగదీశ్వరి

కురుపాం: రానున్న ఎన్నికల్లో నియోజకవర్గంలో టీడీపీ, జనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్థి గెలుపునకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని టీడీపీ నియోజకవర్గం ఇన్‌చార్జి తోయక జగదీశ్వరి కోరారు. శుక్రవారం కురుపాంలో తెలుగుదేశం, జనసేన పార్టీ విస్తృత స్థాయి సామావేశం జరిగింది. ఈసందర్భంగా జగదీశ్వరి మాట్లాడుతూ బాబు ష్యూరిటీ భవిష్యత్తు కు గ్యారెంటీ కార్యక్రమం ద్వారా సూపర్ సిక్స్ పథకా లపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమం లో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వైరచర్ల వీరేష్ చంద్రదేవ్, టీడీపీ, జనసేన నాయకులు నందివాడ కృష్ణబాబు, తవిటినాయుడు, మల్లేష్, పురుషోత్తమనాయుడు, మండల కన్వీనర్ కేవీ కొండయ్య, మధుసూదనరావు, వంశీ తదితరులు పాల్గొన్నారు.

కలిసికట్టుగా పనిచేద్దాం


ఐక్యత ప్రకటిస్తున్న టీడీపీ నాయకులు

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: కలిసికట్టుగా పనిచేసి, పార్వతీపురం నియోజకవర్గంలో టీడీపీ జెండాను ఎగురవే ద్దామని ఆ పార్టీ ద్వితీయ శ్రేణి నాయకులు పిలుపునిచ్చా రు. పార్వతీపురం పట్టణంతో పాటు బలిజిపేట, సీతానగరం, పార్వతీపురం మండలాల పార్టీ అధ్యక్షులు, కార్యదర్శులు శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కొంతమంది టీడీపీని బలహీనపరిచేందుకు బోనెల విజయచంద్రకు బదులు మరొకరికి టికెట్ వస్తుందని దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. అటువంటివి నమ్మకుండా విజయచంద్ర విజయానికి కలిసికట్టుగా పనిచేద్దామని పిలుపునిచ్చారు. టీడీపీ బలిజిపేట, పార్వతీపురం, సీతానగరం అధ్యక్షులు పి.వేణుగోపాలనాయుడు, బోనుదేవీ చంద్రమౌళి, పెంట సత్యం, పార్టీ పట్టణ అధ్యక్షుడు జి.రవికుమార్, పట్టణ ప్రధాన కార్యదర్శి మజ్జి వెంకటేష్, పార్టీ అరకు పార్లమెంట్ ఉపాధ్యక్షుడు గొట్టాపు వెంకటనాయుడు, పార్వతీపురం, సీతానగరం మండలాల ప్రధాన కార్యదర్శులు జి.చంద్రమౌళి, వేణునాయుడు, పార్వతీపురం పట్టణ నాయకులు కోలా మధుసూదనరావు, బార్నాల సీతారాం, నియోజకవర్గ పరిధిలో ముఖ్య నాయకులు పి.సత్యనారాయణ, చుక్క పోలినాయుడు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థుల మరణాలపై చర్యలు తీసుకోండి

- గిరిజన గ్రామాల్లో రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకరరావు పర్యటన
- సమస్యలపై ఏకరువు పెట్టిన వివిధ సంఘాల నాయకులు


సాలూరు: శంకరరావుకు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

సాలూరు: జిల్లాలో గిరిజన విద్యార్థుల మరణాలను నివారించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎన్వై నాయుడు.. రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు డా.డీవీజీ శంకరరావును కోరారు. శుక్రవారం సాలూరు పట్టణానికి వచ్చిన ఆయన్ని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి నేటి వరకు 16 మంది గిరిజన విద్యార్థులు మృత్యువాత పడ్డారని చెప్పారు. ఆ మరణాలపై పూర్తి స్థాయిలో దర్యాప్తు నిర్వహించాలని కోరారు. వారి కుటుంబ సభ్యులకు ఐటీడీఏ ద్వారా ఉపాధి కల్పించాలన్నారు. ఆశ్రమ పాఠశాలలు, హాస్టల్స్‌లో కూడా ఏఎన్ఎంలను నియమించాలని కోరారు. సాలూరు పట్టణానికి మంజూరైన గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలను ప్రారంభించాలన్నారు. బాలికల ఆశ్రమ పాఠశాలను మంజూరు చేయాలని కోరారు. ఐటీడీఏ పాలక మండలి సమావేశాలను రెగ్యులర్‌గా ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మర్రి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యను తీర్చండి

సాలూరు రూరల్: తమ భూసమస్యను తీర్చాలని జిల్లేడువలస, బొర్రపణుకువలస గిరిజనులు.. రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకరరావును కోరారు. శుక్రవారం సాలూరుకు విచ్చేసిన ఆయనకు సీపీఎం నేతలు మర్రి శ్రీనివాసరావు, ఎన్వై నాయుడు, సీదరపు అప్పారావు ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు.

ఆదివాసీ మహిళల ఆత్మగౌరవం కాపాడాలి

మరుగుదొడ్లు నిర్మించి ఆదివాసీ మహిళల ఆత్మగౌరవం కాపాడాలని ఆదివాసీ జేఏసీ సాలూరు మండల అధ్యక్షుడు నిమ్మక అన్నారావు.. ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకరరావును కోరారు. శుక్రవారం యర్రసామంతవలస వచ్చిన ఆయనకు వినతిపత్రం అందించారు. పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో ఉన్న అన్ని గిరిజన గ్రామాలను షెడ్యూల్డ్‌గా ప్రకటించాలని కోరారు. వసతిగృహాల్లో మరణించిన గిరిజన బాలికల కుటుంబాలకు నష్టపరిహారం ఇవ్వాలని కోరారు.

సరాయివలస ఆశ్రమ పాఠశాల తనిఖీ

పాచిపెంట: సరాయివలస గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకరరావు శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. 'ఆంధ్రజ్యోతి'లో ఇటీవల ప్రచురితమైన 'మరణ మృదంగం' కథనంపై ఆయన స్పందించి, ఆకస్మికంగా పర్యటించారు. ముందుగా ఆశ్రమ పాఠశాలలోగల అటెండెన్స్ రిజిష్టరు, మెడికల్ రిజిష్టరు, సిక్ రిజిష్టర్లను పరిశీలించారు. ఇద్దరు విద్యార్థులతో మాట్లాడారు. జ్వరాలు వచ్చేటప్పుడు వైద్య సిబ్బంది వైద్య సక్రమంగా స్పందిస్తున్నారా? లేదా? అని ప్రశ్నించారు. భోజన సదుపాయం సక్రమంగా ఉందా అని ప్రశ్నించగా.. బాగానే చూస్తున్నారని పిల్లలు చెప్పారు. ఏకలవ్య పాఠశాలను కూడా తనిఖీ చేసి విద్యార్థులకు మంజూరైన బ్యాగ్‌లను అందజేశారు. జిల్లా గిరిజన సంక్షేమ సాధికారిత అధికారి కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కారణాలను తెలుసుకుంటాం

గిరిజన విద్యార్థుల మరణాలకు సంబంధించి మూల కారణాలు అన్వేషించి ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామని డీవీజీ శంకరరావు తెలిపారు. సరాయివలస గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేసిన సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడారు. విద్యార్థుల మరణాలకు మూల కారణాలు అన్వేషించేందుకు విజయనగరం వైద్య కళాశాల నుంచి సోషల్ అండ్ ప్రీలిమెంట్ మెడిసిన్ ఆర్గనైజరు నుంచి, ట్రైబుల్ యూనివర్సిటీ సహకారం కోరుతామని తెలిపారు. ఎక్కువ మంది విద్యార్థులు రక్తహీనతతో ఉన్నారని, వైద్య సదుపాయంతో పాటు పౌష్టికాహారం మరింత మెరుగ్గా అందిస్తామని తెలిపారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి... ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామని డీవీజీ చెప్పారు.

మృతుల కుటుంబాలకు నష్ట పరిహారం చెల్లించాలి

అనారోగ్యంతో మృతి చెందిన విద్యార్థుల కుటుంబాలకు నష్ట పరిహారం చెల్లించాలంటూ సరాయివలసలో గిరిజన విద్యార్థి సంఘ నాయకులు సీహెచ్ సీతారాం, జె.బంగార్రాజులు ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రతి ఆశ్రమ పాఠశాలలో ఆదివాసీ ఆరోగ్య సిబ్బందిని నియమించాలని, వసతి గృహాలకు మౌలిక వసతులను, సదుపాయాలను కల్పించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

- **మక్కువ:** ఎర్ర సామంతవలస గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలను రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకర్రావు శుక్రవారం సందర్శించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడి ఇటీవల మృతిచెందిన విద్యార్థి అశోక్ మరణానికిగల కారణాలను తెలుసుకున్నారు. ఈసందర్భంగా పలువురు గిరిజనులు సమస్యలను ప్రస్తావిస్తూ వినతిపత్రాలను అందజేశారు.

రజకులకు అన్యాయం

గుర్ల: రజక కులస్థులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర అన్యాయం చేస్తున్నా యని ఉమ్మడి విజయనగరం జిల్లా రజక సంఘం ఆర్గనైజింగ్ సెక్రెటరీ గంట్రేటి సింహాచలం అన్నారు. శుక్రవారం గుర్లలో విలేకర్లతో మాట్లాడుతూ మన దేశంలో 19 రాష్ట్రాలలో రజకులు ఎస్సీ జాబితాలో ఉన్నారని... మన తెలుగు రాష్ట్రాలలో మాత్రం బీసీ కులాల్లో ఉన్నామని విచారం వ్యక్తం చేశారు. ఒడిశాలో కూడా ఎస్సీ జాబితాలో ఉన్నారని తెలిపారు. ఎస్సీ జాబితాలో చేరుస్తామని మాట ఇచ్చిన వారికే వచ్చే ఎన్నికల్లో తమ మద్దతు ఉంటుందని అన్నారు. ఉమ్మడి జిల్లాలో సుమారు 1,50,000 ఓట్లు ఉన్నాయని చెప్పారు. రాష్ట్రం మొత్తం తమకు 5 ఎమ్మెల్యేలు, ఒక ఎంపీ సీటు కేటాయించాలని డిమాండ్ చేశారు.

ఈవీఎంలపై అవగాహన


ఈవీఎంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

భోగాపురం: కవులవాడ, సవరవల్లి, మంజేరు గ్రామాల్లో ఈవీఎంలపై బీఎల్వోలు శుక్రవారం అవగాహన కల్పించారు. కొత్త ఓటర్లు, యువతకు ఓటు వేయడంపై పూర్తి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.

కంబగూడలో ఆర్థిక అక్షరాస్యత కేంద్రం

సీతంపేట: కంబగూడ గ్రామంలో ఆర్థిక అక్షరాస్యత కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాన్ని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ జేఎల్ఎన్ మూర్తి శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారతీయ స్టేట్‌బ్యాంక్ ఆర్థిక సాయంతో సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సంస్థ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ కేంద్రాన్ని గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాబార్డు డీడీఎం నాగార్జున, డీఆర్‌డీఏ ఇన్‌చార్జి ప్రాజెక్టు డైరెక్టర్ కళ్యాణ్, మధుసూదనరావు, బాబూరావు, పణికుమార్, లలిత, శివ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గరుగుబిల్లి: నాగూరు సబ్‌స్టేషన్ నిర్వహణ పనుల కారణంగా ఆదివారం విద్యు త్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని మండల విద్యుత్‌శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ బి.శంకరరావు తెలిపారు. శుక్రవారం ఆయన విద్యుత్‌శాఖ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. సబ్‌స్టేషన్ పరిధిలోని నాగూరు, రావివలస, లఖనాపురం, చిలకాం, తదితర గ్రామాలకు ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

ప్రవీణ్ ప్రకాష్‌ను పదవి నుంచి తప్పించాలి

గజపతినగరం: విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్‌పై చేసిన ఫిర్యాదు నేపథ్యంలో ఆయన పదవిలో ఉండడం సరికాదని, తక్షణమే తప్పించాలని ఎస్‌జీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.చంద్రరావు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఉపాధ్యాయుల వేదనను గుర్తించి సాధ్యమైనంత త్వరగా నివేదిక అందించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నట్టు తెలిపారు.

ప్రజాపోరు యాత్రలో భాగస్వాములు కావాలి

గజపతినగరం: బీజేపీ ఆధ్వర్యంలో చేపడుతున్న ప్రజా పోరు యాత్రలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఏడుకొండలు అన్నారు. శుక్రవారం స్థానిక బజార్ సెంటర్‌లో ఆర్యవైశ్యులతో ఈ యాత్ర చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నరేంద్ర మోదీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో తాతీయులు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం సీసాల స్వాధీనం

భోగాపురం: పోలిపల్లి గ్రామంలో అక్రమంగా మద్యం తరలిస్తున్న మామిడి బాలకృష్ణను అదుపులోకి తీసుకుని, అతని నుంచి 13 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్టు సీఐ ఎ.రవికుమార్ శుక్రవారం తెలిపారు. అతనిపై కేసు నమోదు చేశామని చెప్పారు.

రైతు మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలి


ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పాలకొండ: హర్యానా సరిహద్దుల్లో సమస్యలపై ఆందోళన చేస్తున్న రైతులపై పోలీసుల దాడుల్లో రైతు శుభకరణ్‌సింగ్ మృతికి కారకులను కఠినంగా శిక్షించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు, ఖండాపు ప్రసాదరావు డిమాండ్ చేశారు. సీఐటీయూ, రైతు సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రైతు ఉద్యమం పట్ల ప్రధాని మోదీ వైఖరి మారకపో తే గుణపాఠం తప్పదన్నారు. ఈ నిరసనలో వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు దూసి దుర్గారావు, వివిధ సంఘాల ప్రతినిధులు ఎస్.ప్రసాద రావు, ఎస్.నాగరాజు, కె.రవికుమార్, ఎస్.రామినాయుడు, డి.పాపారావు, కె.అప్పన్న, కూర్మారావు, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

వైద్యుడిపై దాడి.. బీఎస్పీ నేత అరెస్టు


మాట్లాడుతున్న ఎస్పీ

రాయగడ: మునిగుడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న వైద్యుడు సబ్యసాచి మహాపాత్రపై దాడిచేసిన ఘటనలో బహుజన సమాజపార్టీ జిల్లా అధ్యక్షుడు జితు జకసికను పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను శుక్రవారం ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో ఎస్పీ హరీష్ బిసి వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మునిగుడ పరిధి 'సకట' గ్రామంలో ఉన్న సబ్ సెంటర్‌కు మునిఖోల్‌కు వైద్యుడు సబ్యసాచి మహాపాత్ర కాయకల్ప చికిత్స పర్యవేక్షణ కోసం తన సిబ్బందితో వెళ్లారు. కాయకల్ప సెంటర్ పనిచేయడం లేదని డొంగరియా కొంధో గిరిజనులు, వైద్య సిబ్బందికి మధ్య వాగ్వాదం జరిగింది. ఇంతకాలం పీహెచ్‌సీలో వైద్యులు, సిబ్బంది విధులకు గైర్హాజరు అవుతున్నారని, రోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ జితు వైద్యులపై ఆగ్రహం వెలిబుచ్చారు. దీంతో మాట మాట పెరగడంతో సహనం కోల్పోయిన జితుజకసిక.. సబ్యసాచి మహాపాత్రపై చేయచేసుకున్నారు. దీంతో ఆసుపత్రి సిబ్బంది ఫిర్యాదు మేరకు పోలీసులు జితును అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరిచారు.

ఇదిలాఉండగా గ్రామస్థులు మాట్లాడుతూ 'సకట' గ్రామ ఆరోగ్య కేంద్రంలో వైద్యులు సిబ్బంది ఎప్పుడు ఉండరని ఏదో మొక్కుబడిగా ఇలా వచ్చి అలా వెళ్లిపోతారని ఆరోపించారు. అత్యవసర సమయాల్లో కూడా వైద్య సహాయం అందక గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇంత కాలం ఆరోగ్య కేంద్రాన్ని పట్టించుకోని అధికారులు ఇప్పుడు ఎందుకు శ్రద్ధ పెట్టారని అడిగినందుకు వైద్యుడు సబ్యసాచి గిరిజనులపై నానా దుర్భాషలాడినట్టు వారు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం జిల్లా కేంద్ర ఆసుపత్రి ముఖ్యవైద్యాధికారి లాల్ మోహన్‌రౌత్రాయ్ వివరాలు తెలుసుకునేందుకు మునిగుడ సందర్శించారు.

ఒడిశా

క్లుప్తంగా..

8న శివపార్వతుల కల్యాణం

గరుగుబిల్లి: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మార్చి 8న ఉల్లిభద్రలోని శ్రీసోమేశ్వర స్వామి దేవస్థానం ప్రాంగణంలో శివపార్వతుల కల్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. సాయంత్రం 5 గంటల నుంచి శివ పార్వతుల ఊరేగింపు ఉంటుందన్నారు. రాత్రి 12 గంటల నుంచి లింగోద్భవ పూజలు ఉంటాయన్నారు. కల్యాణంలో పాల్గొనే దంపతులు పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

2న మండల సర్వసభ్య సమావేశం

గజపతినగరం: స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో వచ్చే నెల 2న మండల సర్వసభ్య సమావేశం జరగనున్నట్టు ఎంపీడీవో జయింతి ప్రసాద్ శుక్రవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య హాజరవుతారని చెప్పారు. మండల శాఖ అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు విధిగా హాజరుకావాలని ఆయన కోరారు.

సీఎం సహాయ నిధి అందజేత

వీరఘట్టం: దశమంతుపురానికి చెందిన రామదాసు నాగభూషణ (41) కిడ్నీ వ్యాధితో ఇటీవల మృతిచెందారు. ఈసందర్భంగా సీఎం సహాయ నిధి ద్వారా రూ.2 లక్షలు మంజూరయ్యాయి. అలాగే నడుకూరుకు చెందిన గురుబిల్లి గణపతికి క్యాన్సర్ వ్యాధి సీఎం సహాయ నిధి నుంచి చికిత్సకు రూ.లక్ష మంజూరైంది. ఈ పరిహారాన్ని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి వండువ గ్రామంలోని తన క్యాంప్ కార్యాలయంలో బాధిత కుటుంబాలకు అందించారు.

29లోగా రిజిస్ట్రేషన్లు చేసుకోవాలి

పాలకొండ: ఆంధ్రప్రదేశ్ దుకాణాలు, సంస్థల చట్టం ప్రకారం కార్మిక శాఖ పరిధిలో ఫిబ్రవరి 29లోగా రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని పాలకొండ సహాయ కార్మిక అధికారి ఆర్వీ శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాలకొండ, వీరఘట్టం, సీతంపేట, బూర్జ మండలాల సమీపంలోని మీసేవ కేంద్రాలు, సీఆర్‌సీ సెంటర్లు, గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా తప్పనిసరిగా రిజిస్ట్రేషన్, రెన్యూవల్ చేయించుకోవాలన్నారు.

వలంటీర్లకు సన్మానం

సాలూరు: వలంటీర్ల సేవలు ఎనలేనివని ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర అన్నారు. పట్టణంలో మున్సిపల్ కార్యాలయం ఆవరణలో శుక్రవారం వలంటీర్లకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఈశ్వరమ్మ, వైస్ చైర్మన్‌లు పాల్గొన్నారు.

కొఠియా గ్రామాలకు విద్యుత్తు పునరుద్ధరణ

సాలూరు రూరల్: కొఠియా గ్రూపులోని పగులు చెన్నారు, పట్టుచెన్నారు గ్రామాలకు శుక్రవారం ఉదయం విద్యుత్తు సరఫరాను పునరుద్ధరించారు. ఈ గ్రామాలకు గురువారం రాత్రి విద్యుత్ సరఫరా నిలిపివేసిన విషయం తెలిసిందే. దీనిపై ఆంధ్రజ్యోతిలో కథనం రావడంతో స్పందించిన విద్యుత్ అధికారులు శుక్రవారం ఆ రెండు గ్రామాలకు విద్యుత్తును పునరుద్ధరించారు.

హెచ్ఐవీపై అవగాహన

కొమరాడ: మండల కేంద్రంలో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం వీధి నాటకం వేసి హెచ్ఐవీపై అవగాహన కల్పించారు. పీహెచ్ఎస్ సిబ్బంది రామకృష్ణ, గణపతి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

